


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM




## ఒక్కటైన అమెరికా అబ్బాయి.. ఆంధ్రా అమ్మాయి

ఓ జంట ప్రేమ ఖండాంతరాలు దాటింది. అమెరికా అబ్బాయి.. చిత్తూరు అమ్మాయిని ప్రేమించి పెద్దల్ని ఒప్పించి హైందవ సంప్రదాయంలో పెళ్లి చేసుకున్నారు. గంగవరం మండలం సాయిగార్డెన్ సిటీలో నివసిస్తున్న రేవూరి భాస్కర్-సుమలతరెడ్డి దంపతుల కుమార్తె మీనా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె పనిచేసే సంస్థలో ఆ దేశానికి చెందిన బ్రాడ్లీ టెర్రీతో పరిచయం కాస్త ప్రేమగా మారటంతో పెళ్లితో ఒక్కటయ్యారు.

| | |
|---|---|
| బంగారం ధర (10 GRMS 24 CARAT) | ₹63,440 |
| వెండి ధర (1KG) | 77,800 |
| సెన్సెక్స్ (▲38) | 71,790 |
| నిఫ్టి (▲8) | 21,734 |
| చికెన్ ధర (1KG) | ₹ 260 |
| గుడ్ల ధరలు (డజన్) | ₹68 |



విద్యార్థులకు గుడ్‌న్యూస్..

## మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు

తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మార్చి ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 4 డిగ్రీల మేర పెరిగినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వేసవి ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 32 నుంచి 37 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ తరుణంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటిపూట ఎండలు తీవ్రంగా ఉండడంతో తెలంగాణలో హాఫ్ డే స్కూళ్లను నడపాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. మార్చి 15 నుంచి రాష్ట్రంలోని పాఠశాలల్లో ఒకరోజు తరగతులు నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలల్లో ఏప్రిల్ 23 వరకు ఒక పూట భోజనం పెట్టాలని ఆదేశించింది.ఈ నేపథ్యంలో పాఠశాలలు ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. అయితే 10వ తరగతి కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పాఠశాలల్లో ముందుగా మధ్యాహ్న భోజనం అందించి ఆ తర్వాత తరగతులు కొనసాగుతాయి. 10వ తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత యథావిధిగా ఉదయం తరగతులు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది. విద్యార్థుల పరీక్షల అనంతరం వేసవి సెలవులపై ప్రకటన చేస్తామని విద్యాశాఖ తెలిపింది.



## కొండచరియలు విరిగి పడి.. 2 నెలల చిన్నారి,
# తల్లితో సహా నలుగురు మృతి

కొండ చరియలు విరిగిపడి 2 నెలల చిన్నారి, తల్లితో సహా నలుగురు మృతి చెందారు. ఈ విషాద సంఘటన జమ్మూ కశ్మీర్ లోని రియాసీ జిల్లా మహోర్ సబ్ డివిజన్ లోని చస్సానా గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వింటర్ సీజన్ ప్రారంభమైన జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో భారీగా మంచు కురుస్తోంది. రెండురోజులుగా మహోర్ సబ్ డివిజన్ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో చస్సానాలోని ఓ ఇంటిపై కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇల్లు కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లో గాఢ నిద్రలో ఉన్న వారిపై శిథిలాలు పడడంతో నలుగురు చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. మృతుల్లో 2 నెలల చిన్నారి, తల్లి, మరో ఇద్దరు పిల్లలు ఉన్నట్లు రియాసీ డిప్యూటీ కమిషనర్ విశేష్ పాల్ మహాజన్ తెలిపారు. జమ్మూ సమీపంలోని రాంబన్ ఏరియాలో కొండప్రాంతాల నుంచి భారీగా బురద నీటి చేరికతో జమ్మూ, శ్రీనగర్ హైవేను రెండోరోజు క్లోజ్ చేశారు. లోయ ప్రాంతాల వాసులు అలర్ట్ గా ఉండాలన్నారు అధికారులు. పూంచ్ జిల్లాలో చిక్కుకపోయిన ట్రెక్కర్స్ ను స్థానికులు కాపాడారు. సిమ్లా, మనాలిలోనూ భారీగా కురుస్తున్న మంచు, వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. నాలుగు జాతీయ రహదారులతో సహా 350 రోడ్లను క్లోజ్ చేశారు అధికారులు. కులుతో పెద్దఎత్తున మంచు కురిసే చాన్స్ తో అన్ని విద్యాసంస్థలను మూసివేశారు. హెవీ స్నో ఫాల్ తో కులు జిల్లాలో ట్రాఫిక్ ఎక్కడిక్కడ నిలిచిపోయింది. పలు రహదారులపై రాకపోకలు నిలిచిపోవటంతో టూరిస్టులు ఇబ్బందిపడుతున్నారు. అటల్ టన్నెల్ సైతం క్లోజ్ చేశారు. భారీ మంచుతో సోలాంగ్ నాలాలోని రోడ్లపై పెద్దఎత్తున మంచు పేరుకపోయింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ స్తంభించింది. రోడ్లను క్లీన్ చేసేందుకు BRO అధికారులు చర్యలు చేపట్టారు.



## చరిత్ర సృష్టించిన నాథన్ లియోన్
### ప్రపంచంలో తొలి క్రికెటర్‌గా..

వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో 172 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియోన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన స్పిన్ మయాజాలంతో కివీస్ బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టిన లియోన్.. కివీస్ పతనాన్ని శాసించాడు. అతడి స్పిన్ దాటికి న్యూజిలాండ్ కేవలం 196 పరుగులకే కుప్పకూలింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 10 వికెట్లను లియోన్ సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో సంచలన ప్రదర్శన కనబరిచిన లియోన్ ఓ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే అత్యధిక సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న తొలి బౌలర్‌గా నాథన్ నిలిచాడు. డబ్ల్యూటీసీలో ఇప్పటివరకు ఈ ఆసీస్ దిగ్గజం 10 సార్లు 5 వికెట్ల హాల్ సాధించాడు. కాగా ఇప్పటివరకు ఈ రికార్డు భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉండేది. అశ్విన్ 9 సార్లు ఈ ఫీట్ సాధించాడు. తాజా మ్యాచ్‌తో అశ్విన్ రికార్డును లియోన్ బ్రేక్ చేశాడు.



## హైదరాబాద్‌లో 9 నెలల చిన్నారి కిడ్నాప్..
### గంటల వ్యవధిలో కేసును చేధించిన పోలీసులు

హైదరబాద్ చంచల్‌గూడలో కిడ్నప్‌నకు గురైన 9 నెలల చిన్నారి ఆచూకీ లభించింది. గంటల వ్యవధిలోనే చిన్నారిని జహీరాబాద్‌లో గుర్తించిన పోలీసులు.. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి చంచల్‌గూడలోని ఓ నర్సింగ్ హోమ్‌లో 9 నెలల చిన్నారి అపహరణకు గురైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా అదే దవాఖానలో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన షెహనాజ్ పాపను ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆమె చంచల్‌గూడ నుంచి ఎంజీబీఎస్ వైపు వెళ్తున్న దృశ్యాలు కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దీంతో అక్కడున్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా జహీరాబాద్ బస్సులో వెళ్లినట్టు తేలింది. వెంటనే జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కిడ్నాపర్ షెహనాజ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పాపను సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## సత్యరాజ్ కూతురి పొలిటికల్ ఎంట్రీ?



ప్రముఖ నటుడు సత్యరాజ్ కూతురు దివ్య సత్యరాజ్ ప్రముఖ న్యూట్రిషియన్.. ఆమె చాలా కాలంగా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల తను రాజకీయ రంగప్రవేశం చేస్తానని కూడా స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆమె శనివారం ఓ మీడియా ప్రకటన చేశారు. అందులో.. తనను చాలా మంది రాజకీయ రంగప్రవేశం చేయడానికి కారణం ఏంటి? ఎంపీగా పోటీ చేస్తారా? మంత్రి పదవి కోసం రాయకీయాల్లోకి వస్తున్నారా? వంటి పలు ప్రశ్నలు వేస్తున్నారని పేర్కొన్నారు.

రాజకీయ ఎంట్రీ నిజమే..

తాను రాజకీయరంగ ప్రవేశం చేస్తానని చెప్పిన మాట నిజమేనని, అయితే ఏ పదవిని ఆశించో రాజకీయాల్లోకి రావాలని భావించడం లేదని, ప్రజలకు మంచి చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యం అని చెప్పారు. తాను చాలా కాలంగా పేదలకు సేవలను అందిస్తూ వస్తున్నానని చెప్పారు. మహిళ్‌మతి ఇయక్కం పేరుతో మూడేళ్ల క్రితమే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించినట్లు చెప్పారు. తద్వారా తమిళనాడులోని నిరుపేదలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.

అలాంటి పార్టీలో చేరే ఆలోచనే లేదు

అలాగే తనకు ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయడానికి పిలుపు వచ్చిందన్నారు. అయితే మతతత్వ పార్టీల్లో చేరే ఆలోచన తనకు లేదని, అలాగని తాను సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించనని చెప్పారు. ఏ పార్టీలో చేరేది ఎన్నికలు ముగిసిన తరువాత వెల్లడిస్తానని దివ్య సత్యరాజ్ పేర్కొన్నారు. విప్లవ తమిళుడు సత్యరాజ్ కూతురిగా తమిళుల మంచి కోసం శ్రమిస్తానని ఆమె అన్నారు.

## అవసరమైతే పోటీ నుంచి వైదొలుగుతా: మహాసేన రాజేష్

'నాపై వైసీపీ కార్యకర్తలు చేస్తున్న దుష్ప్రచారంతో పార్టీకి నష్టం కలగకూడదు. తెదేపా-జనసేనపై ఆ ప్రభావం పడకుండా ఉండేందుకు అవసరమైతే పోటీ నుంచి వైదొలుగుతాను' అని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ ప్రకటించారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన పి.గన్నవరం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి వైకాపా శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో తనపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కాకినాడ జిల్లా ఉత్తరకంచిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకుముందు ఒక వీడియో విడుదల చేశారు.



గెలిస్తే చంపేస్తారేమో..!: 'ఒక సామాన్యుడికి అవకాశం వస్తే వ్యవస్థ ఎలా ఏకమైపోతోందో రాష్ట్ర ప్రజలంతా అర్థం చేసుకోవాలి. పోటీ చేయడానికి వస్తేనే ఇంతలా చేస్తున్నారంటే.. ఒకవేళ గెలిచి ఉంటే చంపేస్తారేమో..! పాత వీడియోలను ఎడిట్ చేసి నాతో పాటు తెదేపా-జనసేనలను కించపరిచేందుకు వైసీపీ కుట్రలు చేస్తోంది. ఏడేళ్ల క్రితం మాట్లాడిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇది సరైంది కాదు. నా వల్ల పార్టీకి నష్టం జరుగుతుందనుకుంటే ఎంతవరకైనా తగ్గడానికి సిద్ధం. జగన్‌రెడ్డి బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన తప్ప.. పదవులు కావాలని ఎప్పుడూ ఆలోచించలేదు. వివేకా హత్యకేసులో నిందితుడు అవినాష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు అనంతబాబుకు ఏ అడ్డూ లేదు. వాళ్లు పోటీ చేస్తారు. ప్రచారమూ చేస్తారు. కానీ మహాసేన రాజేష్ మాత్రం పోటీ చేయకూడదట. అప్పట్లో అంబేడ్కర్ చాలా అవమానాలు పడ్డారని పుస్తకాల్లో చదవడమే..! అలాంటి అనుభవాలు నా జీవితంలో ఇప్పుడు మళ్లీ ఎదురయ్యాయి. ఇంకా నా జాతి ఎక్కడుందో, మమ్మల్ని ఎలా అవమానిస్తున్నారో, ఎలా అణచివేయాలని ప్రయత్నిస్తున్నారో చెప్పేందుకు ఇదే నిదర్శనం. ఒకవేళ అధిష్ఠానం తప్పదంటే, పోటీచేసి గెలిచే మొట్టమొదటి నియోజకవర్గం పి.గన్నవరమే' అని రాజేష్ స్పష్టం చేశారు.



## బీజేపీ తొలి లిస్ట్‌లో 'నో' ప్లేస్..
### ఎంపీ సోయం బాపురావు సంచలన కామెంట్స్

తనకు లోక్‌సభ స్థానం నుంచి టికెట్ రాకుండా పార్టీ అగ్రనేతలే అడ్డుపడ్డారని బీజేపీ ఎంపీ సోయం బాపురావు సంచలన కామెంట్స్ చేశారు. నా బలం.. బలగం కావాలనుకుంటే పార్టీ టికెట్ ఇస్తుంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ హైకమాండ్ రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటు, తెలంగాణలో కూడా తొమ్మిది మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. ఈ క్రమంలో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు పేరు తొలి లిస్టులో రాలేదు. ఆదిలాబాద్ గురించి హైకమాండ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక, తొలి జాబితాలో తన పేరు లేకపోవడంతో బాపురావు స్పందిస్తూ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో బాపురావు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. నాకు టికెట్ రాకుండా పార్టీ అగ్రనేతలే అడ్డుపడ్డారు. ఆదివాసీ నేతకు టికెట్ రాకుండా పావులు కదిపారు. నేను ఎక్కడో గెలుస్తానో అనే భయం వాళ్లకు ఉంది. కొమ్మపై ఆధారపడే పక్షిని కాదు నేను.. రెక్కల మీద ఆధారపడిన పక్షిని.. నేను స్వతహాగా ఎగురగలను. టికెట్ రాకపోతే నా దారి నేను చూసుకుంటాను. ఆదిలాబాద్ పార్లమెంట్ సీటు నాదే.. గెలిచేది కూడా నేనే. పార్టీ ఏదనేది అధిష్ఠానం ఆలోచించుకోవాలి. 2019లో టికెట్ ఇస్తా అంటే పారిపోయిన నేతలే టికెట్ కోసం ఇప్పుడు పోటీపడుతున్నారు. ఏ బలంలేని సమయంలో నా సొంత బలంతో బీజేపీకి విజయం అందించాను. జడ్పీటీసీలను, ఎంపీపీలను, చివరికి నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించాను.



## సన్‌రైజర్స్ కెప్టెన్‌గా కమిన్స్?


ఈ ఏడాది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ మారబోతున్నాడా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. మార్‌క్రమ్ స్థానంలో కమిన్స్‌కు సారథ్య బాధ్యతలు అప్పజెప్పేందుకు సన్‌రైజర్స్ యాజమాన్యం ఆసక్తితో ఉన్నట్లు సమాచారం. నిరుడు ఐపీఎల్ వేలంలో కమిన్స్ కోసం సన్‌రైజర్స్ ఏకంగా రూ.20.5 కోట్లు చెల్లించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో అత్యధిక ధర. జట్టుకు కెప్టెన్‌గా నియమించడం కోసమే కమిన్స్‌కు జట్టు భారీ మొత్తం చెల్లించిందని తెలిసింది. గత సీజన్‌లో మార్‌క్రమ్ నాయకత్వంలోని సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో



పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రధాన కోచ్ బ్రయాన్ లారా స్థానాన్ని డేనియల్ వెటోరితో భర్తీ చేసిన విషయం విదితమే. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు సహాయక కోచ్‌గా వెటోరి ఉన్నాడు. కమిన్స్ సారథ్యంలో కంగారూ జట్టు నిరుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలవడంతో పాటు వన్డే ప్రపంచకప్‌నూ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో వెటోరి, కమిన్స్ కలిసి సన్‌రైజర్స్ కోసం పనిచేయబోతున్నారని సమాచారం. ఇక సన్‌రైజర్స్‌కు చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును వరుసగా రెండో సారి దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో సారథిగా మార్‌క్రమ్ విజేతగా నిలిపాడు. అయినప్పటికీ ఐపీఎల్‌లో మాత్రం సన్‌రైజర్స్ కెప్టెన్‌గా అతనిపై వేటు పడటం ఖాయమేనని తెలిసింది. మరోవైపు ఆ జట్టు బౌలింగ్ కోచ్ డేల్‌స్టెయిన్ ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరంగా ఉండనున్నట్లు సమాచారం. బాధ్యతల నుంచి విరామం కోరుకుంటున్న అతను.. 2025 ఐపీఎల్ కోసం తిరిగి జట్టుతో చేరే అవకాశముంది. స్టెయిన్ స్థానంలో న్యూజిలాండ్ మాజీ పేసర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ సన్‌రైజర్స్ జట్టుతో చేరనున్నాడు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

సానియా మల్హోత్ర



# నా యాటిట్యూడ్ అలాగే ఉంటుంది

గతేడాది నేను నటించిన 5 సినిమాలు విడుదల అయ్యాయి. ఫలితాలు ఎలా ఉన్నా.. నటిగా మాత్రం నాకు మంచి గుర్తింపు లభించింది. ముఖ్యంగా 'సామ్ బహదూర్' సినిమాలో నా వయసుకు మించిన పాత్ర పోషించే అవకాశం వచ్చింది. పరిణతితో నటించాల్సిన రోల్ అది. ఆ క్యారెక్టర్ కోసం చాలా హోమ్‌వర్క్ చేశాను. అందులో మానెక్ షా పాత్ర పోషించిన విక్కీ కౌశల్ ఎంతో సపోర్ట్ చేశారు. ఆ సినిమా చూశాక ఆనందంతో కన్నీళ్లు ఆగలేదంటే నమ్మండి. అందరూ ఎంతగానో మెచ్చుకున్నారు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌తో నటించాలని అందరి డ్రీమ్. కెరీర్ తొలినాళ్లలోనే 'జవాన్' సినిమాతో నా కల నెరవేరింది. చిన్నప్పటి నుంచి ఆయన్ను చూస్తూ పెరిగాను. నేను ఢిల్లీలోనే ఉండేదాన్ని! సినిమాల్లోకి రాకముందు షారుఖ్ కూడా ఢిల్లీలోనే ఉండేవారు. ఢిల్లీ అమ్మాయి అని 'జవాన్' షూటింగ్ టైమ్‌లో ఆయన నన్ను ఎంతగానో ఆదరించారు. కారులో తీసుకెళ్లి తన స్కూల్, కాలేజ్ అన్నీ చూపించారు కూడా! జవాన్‌లో ఆయనతో కలిసి పనిచేసిన ఆరుగురం 'గుడ్ టు గో, చీఫ్' పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకున్నాం. అందరం అప్పుడప్పుడూ గ్రూప్ కాల్ చేసుకుంటాం. ఆయన మాతో చాలా సరదాగా మాట్లాడతారు. 'నేను బిగ్‌స్టార్'ని అనే అహం ఆయనలో ఎప్పుడూ కనిపించదు.





# సార్క్ పునరుద్ధరణ ఇప్పట్లో లేనట్లే

## విదేశాంగ మంత్రి జైశంకర్

దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం తక్షణ పునరుద్ధరణను విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తోసిపుచ్చారు. సభ్యదేశమైన పాకిస్థాన్ ఉగ్రవాద అనుకూల వైఖరే అందుకు అవరోధమని కుండబద్దలు కొట్టారు. ఈ కూటమిలోని ఇతర దేశాలపైనా పాక్ అదే తీరును అనుసరిస్తోందని దుయ్యబట్టారు. దిల్లీలో శనివారం జరిగిన 'అనంత ఎస్పెన్ సెంటర్' నిర్వహించిన సమావేశంలో పాక్ పేరును నేరుగా ప్రస్తావించకుండా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సార్క్ భవిష్యత్తు పూర్తిగా పాక్ అనుసరించే విధానంపైనే ఆధారపడి ఉంటుందని జైశంకర్ తేల్చి చెప్పారు. ఓవైపు చర్చల పేరిట ఒక చోటకు చేరి.. మరోవైపు అదే రాత్రి దాడులకు పాల్పడితే ఎలా అని పరోక్షంగా ఆ దేశం తీరును ఎండగట్టారు. ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నెలకొల్పి వారిని సరిహద్దుల వైపు ఉసిగొల్పే సభ్య దేశం ఉన్న సార్క్‌ను ముందుతీసుకెళ్లడం ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. సార్క్ చివరి సమావేశం 2014లో కాఠ్‌మాండూలో జరిగింది. 2016లో ఇస్లామాబాద్‌లో జరగాల్సి ఉన్నప్పటికీ.. భారత్ దాన్ని బహిష్కరించింది. అదే సంవత్సరం సెప్టెంబర్ 18న జమ్ముకశ్మీర్‌లోని ఉరి సైనిక శిబిరంపై ఉగ్రదాడి జరగడమే అందుకు కారణం. ఆ తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్ సైతం సమావేశంలో పాల్గొనడానికి నిరాకరించాయి.

**పాక్ ప్రధాని ఎన్నిక నేడు**

సార్క్‌కు బదులు బిమ్‌స్టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ-సెక్టోరల్ టెక్నికల్, ఎకనామిక్ కోఆపరేషన్) కూటమి కింద సహకారం బలపడుతోందని జైశంకర్ తెలిపారు. ఇక్కడ కూడా సమస్యలు ఉన్నప్పటికీ.. సార్క్‌తో ఉన్నవాటితో పోలిస్తే చాలా భిన్నమైనవని వివరించారు. పరస్పర సహకారంతో ముందుకెళ్లాలనే ఆకాంక్ష ఈ కూటమి సభ్యదేశాల మధ్య బలంగా ఉందన్నారు.

**చైనాతో సంబంధాలపై..**

సరిహద్దు ఒప్పందాలకు చైనా కట్టుబడి ఉండాలని జైశంకర్ స్పష్టం చేశారు. వాస్తవాధీన రేఖ వెంట శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి సహకరించాలన్నారు. అప్పుడే భారత్-చైనా మధ్య సంబంధాలు మెరుగవుతాయని తెలిపారు. ఆ దేశంతో వ్యవహరించే విషయంలో గత ప్రభుత్వాలు అంతర్జాతీయ సంబంధాలను ప్రభావవంతంగా వినియోగించుకోలేదని వివరించారు. చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా తిప్పికొట్టాలంటే సాంకేతికత, సరఫరా వ్యవస్థల వంటి వాటిని భారత్ బలంగా నిర్మించుకోవాలని చెప్పారు.

**అత్యాధునిక సాంకేతికతల ముప్పు..**

జాతీయ భద్రతకు సరిహద్దుల వద్ద ముప్పు, ఉగ్రవాదం మాత్రమే సవాళ్లు కాదని జైశంకర్ అన్నారు. కృత్రిమ మేధ (AI), డీప్‌ఫేక్‌ల వంటి అత్యాధునిక సాంకేతికతల నుంచీ సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. దేశీయ అంతర్గత విషయాల్లో సైబర్ మార్గాన బయటి శక్తుల జోక్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

# అంగన్‌వాడీల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు చేపట్టాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండేలా చూడాలని, అవసర మైనచోట కొత్త భవనాలను నిర్మించాలని సూచించారు. శనివారం సచివాలయంలో మహిళాభివృద్ధి, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలపై సీఎం సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించడ మే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 35వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు. ఈ మేరకు అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారు లకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**'ఉపాధి హామీ' లింకేజీతో సొంత భవనాలు**

రాష్ట్రంలో 12,315 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని, వాటికి శాశ్వత ప్రాతిపదికన సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులను జోడించి మొదటి ప్రాధాన్యతగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాష్ట్రమంతటా ఎక్కడ చూసినా ఒకేలా అంగన్‌వాడీ కేంద్రాల బ్రాండింగ్ ఉండాలని.. ఇందుకోసం ప్రత్యేక డిజైన్ రూపొందించాలని సూచించారు. అవసరమైతే ఆరేళ్ల లోపు చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు.



**ఆరు నెలలకోసారి వారోత్సవాలు..**

మహిళా శిశుసంక్షేమ శాఖ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆరు నెలలకోసారి ప్రత్యేక వారోత్సవాలు నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఇక దివ్యాంగులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో మరిన్ని వృద్ధాశ్రమాల ఏర్పాటుకు కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, సీఎస్ శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# పాక్ వెళ్తున్న ఓడ ముంబైలో నిలిపివేత

చైనా నుంచి పాకిస్తాన్ వైపు వెళ్తున్న ఓ అనుమానాస్పద ఓడను భారత భద్రతా అధికారులు ముంబైలోని నావసేవ పోర్టులో నిలిపివేశారు. అందులో ఉన్న సామగ్రి పాక్ అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలకు సైతం ఉపయోగపడుతుందని గుర్తించారు. మాల్టాకు చెందిన సీఎంఏ సీజీఎం అత్తిలా అనే ఓడ పాక్‌లో ని కరాచీ రేవు పట్టణానికి వెళ్తుండగా జనవరి 23వ తేదీన కస్టమ్స్ అధికారులు తనిఖీలు జరిపారు. మొత్తం 22 టన్నుల బరువున్న ఈ సామగ్రిలో ఇటలీ తయారీ కంప్యూటర్ న్యూమెరికల్ కంట్రోల్(సీఎన్‌సీ)అనే యంత్రం ఉన్నట్లు గుర్తించారు. అత్యంత కచ్చితత్వంతో పనిచేసే ఈ యంత్రాన్ని కంప్యూటర్‌తో ఆపరేట్ చేయొచ్చు. అనంతరం దీనిని పరిశీలించిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)అధికారులు సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరించారు.



# రిపబ్లికన్ పార్టీ ప్రైమరీల్లో ట్రంప్‌దే హవా

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించేందుకు జరుగుతున్న పార్టీ ప్రైమరీ బ్యాలెట్ ఎన్నికల్లో దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజయపరంపర కొనసాగుతోంది. తాజాగా శనివారం జరిగిన ఇడాహో, మిస్సోరి రిపబ్లికన్ ప్రైమైరీ ఎన్నికల్లో విజయం సాధించడమే కాకుండా మిచిగాన్ కన్వెన్షన్ గ్రాండ్ రాపిడ్ ప్రతినిధుల కేటాయింపులో ట్రంప్ పూర్తి పై చేయి సాధించారు. ట్రంప్‌నకు మద్దతుగా ఇప్పటి వరకు 244 డెలిగేట్లు ఉండగా ప్రత్యర్థి నిక్కీ హాలేకు మద్దతుగా కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి నామినేట్ అవ్వాలంటే మొత్తం 1215 డెలిగేట్‌ల మద్దతు అవసరం. అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో అతి పెద్ద ఈవెంట్‌గా చెప్పే మార్చి 5 (సూపర్ ట్యూస్‌డే) మంగళవారం రోజు ఏకంగా 16 రాష్ట్రాల్లో ప్రైమరీ బ్యాలెట్ పోరు జరగనుంది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల తుదిపోరులో అధికార డెమొక్రాట్లు, రిపబ్లికన్ పార్టీల తరపున గతంలో తలపడ్డ అభ్యర్థులు జో బైడెన్, ట్రంప్ మళ్లీ తలపడనున్నారనేది దాదాపు ఖాయమైంది. ఇటు బైడెన్ విషయంలో అధిక వయసు, మతిమరుపు వంటి అంశాలు, అటు ట్రంప్‌ను వేధిస్తున్న న్యాయపరమైన కేసుల చిక్కులు ఉన్నప్పటికీ ఇద్దరే మళ్లీ అధ్యక్ష పదవి రేసులో ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.




# నేటి నుంచి 5 వరకు పల్స్ పోలియో..

## ఐదేండ్ల పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ ఇప్పించండి

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి పల్స్ పోలియో కార్యక్రమం జరగనున్నది. ఆదివారం నిర్దేశిత సెంటర్లలో పోలియో వ్యాక్సినేషన్ జరుగుతుందని, 4, 5 తేదీల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుకలు వేస్తారని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో 4, 6 తేదీల్లోనూ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 22,445 పోలియో బూత్‌లలో 40,57,320 మందికి పోలియో డ్రాప్స్ వేసేందుకు 910 మొబైల్ టీమ్స్, 910 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేశామని, 2245 సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారని, 8754 ఏఎన్ఎంలు, 28,160 ఆశాలు, 35,700 మంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు. 50.30 లక్షల డోసులను జిల్లాలకు పంపినట్టు తెలిపారు.

# "ఫ్యామిలీ స్టార్" టీజర్ కి డేట్ & టైం వచ్చేశాయ్




టాలీవుడ్ రౌడీ హీరో సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబినేషన్ లో చేస్తున్న రెండో చిత్రం "ఫ్యామిలీ స్టార్" కోసం అందరికీ తెలిసిందే. మరి మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం పై మంచి అంచనాలు నెలకొనగా రీసెంట్ గానే ఈ సినిమా టీజర్ పై హింట్ కూడా తాను ఇచ్చాడు. అయితే ఇప్పుడు ఫైనల్ గా మేకర్స్ ఈ టీజర్ పై లేటెస్ట్ అప్డేట్ ఇచ్చేసారు. దీని ప్రకారం ఈ టీజర్ ఈ మార్చ్ 4న సాయంత్రం ఆరున్నరకు విడుదల చేస్తున్నట్టుగా విజయ్ దేవరకొండ పై ఇంట్రెస్టింగ్ పోస్టర్ తో అనౌన్స్ చేశారు. మొత్తానికి అయితే విజయ్ తో మంచి ఎంటర్టైన్మెంట్ నే మేకర్స్ ప్లాన్ చేసినట్టుగా అనిపిస్తుంది. మరి చూడాలి ఈ చిత్రం ఎలా ఉంటుందో. ఇక ఈ చిత్రానికి గోపి సుందర్ సంగీతం అందిస్తుండగా దిల్ రాజు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఏప్రిల్ 5న సినిమా తెలుగు, తమిళ్ లో రిలీజ్ కాబోతుంది.

# రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవడమేంటి?

## టీడీపీ అధినేత చంద్రబాబు



రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవడమేంటని సీఎం జగన్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రశ్నించారు. ఇది రాష్ట్రానికి అవమానకరమని విమర్శించారు. 'రూ.370 కోట్లకు రాష్ట్ర పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టడమేంటి? జగన్ తాకట్టు పెట్టింది భవనాలను కాదు.. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని. ముఖ్యమంత్రి సమున్నతమైన ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను నాశనం చేశారు. అసమర్థ, అహంకార పాలనలో ఏం కోల్పోతున్నామో ఆలోచించాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**ఇంతకంటే దిగజారలేరు అనుకున్న ప్రతిసారీ మరో మెట్టు దిగుతున్నారు: లోకేశ్**

గత ఐదేళ్లుగా జగన్ తెస్తున్న అప్పులను చూసి తల పండిన ఆర్థికవేత్తలకు సైతం మైండ్ బ్లాంక్ అవుతోందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని రూ.12.5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన జగన్.. ఇప్పుడు ఏకంగా సచివాలయాన్ని తాకట్టుపెట్టారన్న వార్త చూసి షాక్‌కు గురైనట్లు తెలిపారు. "ఏపీని అప్పుల కుప్పగా చేసి మరో శ్రీలంకలా మార్చేస్తున్నారని మేమంటే ఒంటికాలిపై లేచిన వైకాపా మేధావులు దీనికేం సమాధానం చెబుతారు? ఏపీ సచివాలయాన్ని రూ.370 కోట్లకు తాకట్టుపెట్టిన జగన్ పనితనాన్ని చూశాక ఆ దేశంతో పోల్చడం ఏ మాత్రం సరికాదని అనిపిస్తోంది. ఎంత ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా శ్రీలంక తమ పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టలేదు. ఇంతకంటే దిగజారలేరు అనుకున్న ప్రతిసారీ మరో మెట్టు దిగిపోతూ రాష్ట్ర పరువును మంటగలుపుతున్న ఈ ముఖ్యమంత్రిని ఏమనాలో.. ఎవరితో పోల్చాలో మాటలు రావడం లేదు" అని నారా లోకేశ్ అన్నారు.